ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





బ్యారేజీ దిగువన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మూగరోదన

విద్యుదాఘాతానికి బలవుతున్న పశువులు



చిన్నగూడూరు మండలం మంగోరిగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన దుక్కిటెద్దులు

- అకాల వర్షాలు, ఈదురు గాలులతో నేలవాలుతున్న కరెంట్ తీగలు
- ఏప్రిల్ నుంచి జూన్ 7 వరకు 44 పశువుల మృత్యువాత
- సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ.. రైతుల ఆవేదన
- నష్టపరిహారం చెల్లించాలని బాధితుల డిమాండ్

సీరోలు, జూన్ 7 : కరెంట్ తీగెలు పశువులకు యమ పాశాలుగా మారాయి. జిల్లాలో విద్యుదాఘాతానికి మూగ జీవాలు బలి అవుతున్నాయి. అకాల వర్షాలు, గాలిదుమారంతో విద్యుత్ తీగెలు పడుతుండటం.. మేత కోసం వెళ్లిన నోరులేని పశువులు మృత్యువాత పడుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్యు దాఘాతంతో పాడిగేదెలు, ఆవులు చనిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌ఘాతంతో గత ఏప్రిల్ నెల నుంచి జూన్ 7వ తేదీ వరకు సుమారు 44 వరకు పాడిగేదెలు, ఆవులు చనిపోయాయి.

వేసవి కాలంలో అకాలవర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్‌స్తంభాలు విరిగిపోవడం, వైర్లుతెగి కిందపడిపోవడం, ట్రాన్స్‌పార్మర్ల ఎర్త్‌వైర్ల వద్ద కరెంట్ సరఫరా కావడం తదితర కారణాలతో పశువులు మృతి చెందుతున్నాయి. గత ఏప్రిల్ నెల నుంచి జూన్ 7వ తేదీ వరకు వ్యవసాయ భూముల్లో ఏ విధమైన పంటలు ఉండకపోవటంతో పశువులు మేత కోసం వెళ్తున్నాయి. బయటకు వెళ్లిన పశువులు ఇంటికి వచ్చే వరకు రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఈ క్రమంలో ఎక్కడ ఏ విద్యుత్ స్తంభం విరిగిపడిందో? ఏ కరెంట్ తీగలు కిందపడిపోయాయో! ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోననే భయాందోళనలో రైతులు ఉంటున్నారు.

మంగోరిగూడెంలో శుక్రవారం ఒక్కరోజే 11 పశువులు మృతి..

చిన్నగూడూరు మండలం మంగోరిగూడెంలో శుక్రవారం ఒక ఆవు, 7 దుక్కిటెద్దులు, మేగ్యతండాలో 3 దుక్కిటెద్దులు విద్యుదాఘాతంతో మొత్తం 11 మృతి చెందాయి. గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు కరెంట్‌వైర్లు తెగిపడి, మేతకు వెళ్లిన లూనావత్ రాంజీకి చెందిన ఆవు-1, లూనావత్ బాలాజీకి చెందిన దుక్కిటెద్దు-1, లూనావత్ నరేష్-1, లూనావత్ వెంకన్న-1, లూనావత్ రమేష్- 2, మచ్చ రాములుకు చెందిన 1 దుక్కిటెద్దుతో కలిసి మొత్తం 8 పశువులు విద్యాతాఘాతంతో మృతి చెందాయి. మేగ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని లకావత్‌తండాకు చెందిన లకావత్ సురేష్-1, లకావత్ బాలు-1. బానోత్ సిరి-1 మొత్తం 3 దుక్కిటెద్దులు కరెంట్ షాక్‌తో మృతి చెందగా, బాధిత రైతులు పశువుల వద్ద రోదిస్తున్నారు. దంతాలపల్లి మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన సుంకరి భాస్కర్‌కు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది.

4న కురవిలో 7 గేదెలు..

కురవి మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఈనెల 4న ఏడు పాడిగేదెలు మృతి చెందాయి. నల్లాల బావి రహదారిలో మూడ్రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో విద్యుత్ తీగలు కిందకు వంగిపోయాయి. మేత కోసం వెళ్లిన పాడిగేదెలు ఆ తీదెలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనలో కాట్యాల శ్రీను-2, కట్యాల ఐలయ్య-2, కాకి వెంకటరెడ్డి-1, కాట్యాల వెంకట్రాములు-1,కానుగంటి మల్లయ్య-1 మొత్తం 7 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి.

మే 22న తొమ్మిది..

సీరోలు మండలం మన్నెగూడెంలో మే 22వ తేదీన ఒకేచోట ఆరు ఆవులు, ఒక ఆంబోతు విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాయి. 21 రాత్రి వచ్చిన వర్షం, ఈదురు గాలులకు గ్రామసమీప వ్యవసాయ భూమిలో ఉన్న తుమ్మచెట్టు విరిగి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడిన విద్యుత్ తీగలు తగిలి గ్రామానికి చెందిన భూక్య భాస్కర్-1, భూక్య సామ్య-1, తేజావత్ సోమ్లా-1, తేజావత్ బాసు-1, తేజావత్ వీరు-1, లింగబోయిన నానే-1, ఆంబోతు-1 మొత్తం7 పశువులు విద్యుతాఘాతానికి గురయ్యాయి. తొర్రూరు మండలం నాంచారిమడూరుకు చెందిన బంగారి సోమయ్యకు చెందిన రెండు పాడిగేదెలను మేత కోసం తీసుకువెళ్లగా తెగిపడి ఉన్నవిద్యుత్‌వైర్లు తగిలి రెండు పాడిగేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. కురవి మండలం నల్లెల్ల శివారు లింగ్యతండాలో ధరంసోతు రవికి చెందిన ఆవు విద్యుదాఘాతనికి గురై అక్కడిక్కడే మృతి చెందింది.

జిల్లాలో వర్షాకాలం ప్రారంభం కాకముందే విద్యుదాఘాతానికి పశువులు మృత్యువాత పడుతోండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్నందున రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారని విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్ల వద్ద మరమ్మతులు చేపట్టి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ..

గత ఏప్రిల్, మే నెలల నుంచే ఈదురుగాలులు వీస్తాయని.. ఈ గాలులకు కరెంట్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌పార్మర్ల వద్ద ఎర్త్‌వైర్లు మొదలగు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులది. అయితే అధికారుల నిర్లక్ష్యంతోనే పశుపక్షాదులు, ప్రజలు విద్యుత్‌ఘాతానికి బలవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, మండల స్థాయిలో ఏఈలు, గ్రామస్థాయిలో లైన్‌మెన్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం

- నరేష్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, మహబూబాబాద్



విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు సిబ్బందిని నియమించాం. గాలులతో కూడిన వర్షాలకు కరెంట్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు తెగిపడటం తదితరుల సమస్యలను ప్రజల దృష్టికి వస్తే, వెంటనే అధికారులు, సిబ్బందికి తెలిపి.. ప్రమాదాల నివారణకు తోడ్పాటునందించాలి. రైతులు కూడా పశువులను మేతకు వదిలినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని, ప్రమాదాల నుంచి కాపాడేందుకు కృషి చేయాలి. విద్యుత్‌శాఖ ఏడీ, డీఈ, ఏఈలతో సమావేశాలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం.

వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

- ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటిస్తూ వేగం పెంచాలి
- నిర్మాణ సంస్థల ఖర్చులతోనే టెస్టులు, తాత్కాలిక మరమ్మతులు
- మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ పనితీరుపై అసహనం




మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

వివరాలు : 7 లో..

పనుల్లో వేగం పెంచండి

అన్నారం బ్యారేజీ సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్



బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పినాకి చంద్ర ఘోష్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూన్ 7 : మానుకోట జిల్లా కేంద్రంలోని పాత బజారులో ఈనెల 8న ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లందు రోడ్, శిఖార్‌ఖాన గడ్డ, సూర్య థియేటర్, రైల్వేస్టేషనర్ రోడ్, భవానీనగర్ తండా, హస్తినాపురంకాలనీ, నందన గార్డెన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనులు జరుగుతున్నాయని వివరించారు. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

- ఎన్నికల కోడ్‌తో సంక్షేమ పథకాలు కుంటుపడ్డాయి
- పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క

కొత్తగూడ, జూన్ 7 : ప్రజల సహకారంతో తెలంగాణరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పంచాయతీ రాజ్‌శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి మంత్రి సీతక్క తెలిపారు. ఎన్నికల కోడ్‌తో నిలిచిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వివరించారు. కొత్తగూడ మండలంలో ఆమె పర్యటించి, మాట్లాడారు. 2004 లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకే నెలలో భారత దేశంలో ఎన్నికలు నిర్వహించారని పేర్కొన్నారు. మోదీ కుట్రలో భాగంగానే ఎలక్షన్‌లు పలు దశలుగా మూడునెలలు నిర్వహించారని ఆరోపించారు. అయోధ్య పేరు చెప్పుకుని ఎన్నికల్లో ఓట్లు పొందాలని చూశారు కాని.. బీజేపీని అక్కడి ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. అయినా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీకి మెజారిటీ ఎంపీ సీట్లు రాలేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ చంద్రబాబు, నితీష్‌కుమార్‌పై ఆధారపడుతుందని విమర్శించారు. ఎలక్షన్ కోడ్ వలన మూడునెలలుగా ప్రజాపాలన ద్వారా ప్రజలకు అందాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని మంత్రి సీతక్క. ఎన్నికల కోడ్ ముగియగానే అధికారులతో చర్చించి, ప్రజాపాలన సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నామన్నారు.



మొండ్రాయిగూడెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీతక్క

పెద్దమ్మతల్లి దేవతకు పూజలు..

మోకాళ్లపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి పండుగను గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. పండుగలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. డోలీవాయిద్యాలు మోగిస్తుండగా గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి, తల్లికి సమర్పించారు. మహిళలు, చిన్నారులతో మంత్రి నృత్యాలు చేశారు. పెద్దమ్మతల్లి గుడి లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాగునీరు అందిస్తా, బస్ సౌకర్యం కల్పిస్తా..

సాగునీరు అందించాలని, బస్ సౌకర్యం కల్పించాలని మొండ్రాయిగూడెం ప్రజలు మంత్రి సీతక్కను కోరారు. అధికారులతో చర్చించి సాగునీరు అందిస్తా, బస్ సౌకర్యం కల్పిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

- అధికారిక ప్రకటన కోసం అర్ధరాత్రి వరకు ఎదురుచూపు
- మూడో ప్రయత్నంలో దక్కిన విజయం
- అన్ని రౌండ్లలోనూ ఆయనదే ఆధిక్యత
- చివరి వరకు ఉత్కంఠగా సాగిన లెక్కింపు

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న విజయం దాదాపు ఖాయమైంది. కానీ ఎన్నికల సంఘం అనుమతితో ఆయన గెలుపును ప్రకటించేందుకు అధికారులు శుక్రవారం అర్ధరాత్రి వరకు ఎదురుచూశారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి కంటే మల్లన్నకు ఎక్కువ ఓట్లుండడంతో మల్లన్నను విజేతగా ప్రకటించేందుకు ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి లేఖరాశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మూడు రోజుల పాటు సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతీ రౌండ్‌లోనూ మల్లన్న ఆధిక్యతను చాటితే రాకేష్‌రెడ్డి కూడా సత్తా చాటుతూ వచ్చారు. చివరి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొనడం ఉత్కంఠను రేపింది. ఇక స్వతంత్రుల్లో అశోక్‌కుమార్ మినహా మిగిలిన 48మందికి వచ్చిన ఓట్లను ఎలిమినేషన్‌లో పద్ధతిలో చేయగా.. తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డికి దాదాపు సమానంగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. మొత్తం 57 మంది అభ్యర్థుల్లో రాత్రి పదిగంటలవరకు అధికారికంగా ప్రకటించిన ప్రకారం మొదటి 47మంది స్వతంత్ర అభ్యర్థుల బ్యాలెట్ల నుంచి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కలుపుకొని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 124899 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,05,524 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 30,461 ఓట్లు వచ్చాయి. ఈ ఎలిమినేషన్ల తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు జడ్సన్, పాలకూరి అశోక్‌కుమార్‌తో పాటు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ కూడా రాత్రి పదిలోపు పూర్తయింది. అప్పటికీ మల్లన్నకే ఆధిక్యత ఉన్నప్పటికీ కోటా ఓటుకు చేరకపోవడంతో ఎన్నికల సంఘం అనుమతి మేరకు ఆయన్ను విజేతగా ప్రకటించే ప్రక్రియను చేపట్టారు. అధికారిక ప్రకటన ఆలస్యమవుతుండడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద నాయకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.



కౌంటింగ్ కేంద్రం వద్ద విజయానందంలో తీన్మార్ మల్లన్న

అశోక్, ప్రేమేందర్ ఎలిమినేషన్ తర్వాత కూడా ఎవరికీ రాని కోటా ఓటు

మొదటి ప్రాధాన్యతలో 29,697 ఓట్లు సాధించిన కీలక స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ ఎలిమినేషన్‌లో ఆయనకు వచ్చిన ఓట్లతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కూడా ప్రధాన అభ్యర్థుల్లో ఎవరికీ ఏకపక్షంగా రాలేదు. ఈయన ఎలిమినేషన్ తర్వాత బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆయనకు వచ్చిన 43,313 బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యత లోనూ ఎవరికీ ఏకపక్షంగా ఓట్లు పడలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి బీజేపీ కేడర్‌తో సన్నిహిత సంబంధాలుండడం, ఆయన ఇటీవలి వరకు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసి ఉన్న నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటేసిన వారిలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేస్తారని భావించినా వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు గణనీయమైన ఓట్లు రావడంతో ఆయనే మంచి మెజార్టీతో ఆధిక్యతలో ఉన్నారు. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల అనుమతితో సాంకేతిక వెసులుబాటు ద్వారా మల్లన్నను విజేతగా ప్రకటించే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన చేపట్టారు.

2021 మాదిరిగానే చివరి వరకు ఉత్కంఠ

2021లో జరిగిన ఎన్నికలోనూ దాదాపు ఇదేరీతిలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాటి స్వతంత్ర అభ్యర్థి తీన్మార్‌మల్లన్న,

మిగతా 8వ పేజీలో..

ప్రైవేట్ క్లినిక్‌లపై రాష్ట్ర వైద్యమండలి కొరడా

- అర్హతలు లేని నకిలీ డాక్టర్లపై కేసు
- మరిపెడలో నాలుగు ఆస్పత్రుల సీజ్
- మరోమూడు దవాఖానల నిర్వాహకుల పరార్

మరిపెడ, జూన్ 7 : మండల కేంద్రంలోని ప్రైవేట్ క్లినిక్‌లపై రాష్ట్ర వైద్య మండలి కొరడా ఝుళిపించింది. శుక్రవారం రాష్ట్ర వైద్య టాస్క్‌ఫోర్స్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించి, నాలుగు క్లినిక్‌ల నిర్వాహకులపై ఎన్ఎంసీ చట్టం 34, 54 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, వాటిని సీజ్ చేశారు. మరో మూడు ఆస్పత్రుల నిర్వాహకులు తనిఖీ బృందాల రాకను పసిగట్టి ముందే వాటిని మూసేసి, పరారయ్యారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వేములపల్లి నరేశ్‌కుమార్ తనిఖీల వివరాలను విలేకరులకు వెల్లడించారు.



మరిపెడలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో తనిఖీ నిర్వహిస్తున్న రాష్ట్ర వైద్య మండలి టాస్క్‌ఫోర్స్ బృందం

మరిపెడలో పలువురు ఎలాంటి అర్హతలు లేకున్నా, డాక్టర్లు కాకున్నా స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని రాష్ట్ర వైద్య మండలికి కొన్ని రోజుల క్రితం ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం మరిపెడలోని రవి క్లినిక్, రామారావు క్లినిక్, శ్రీనివాస ప్రథమ చికిత్సాలయం, బీవీ నాయక్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయగా, అనేక ఆసక్తికర విషయాలు బయటపడ్డాయన్నారు. కంభంపాటి రవి అనేవ్యక్తి రవి క్లినిక్‌ను నిర్వహిస్తూ రోగులను మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈయనకు ఎలాంటి డాక్టరు అర్హతలు లేవన్నారు. కార్పొరేట్‌స్థాయి లెవల్‌లో వైద్యం నిర్వహిస్తున్నారన్నారు. రామారావు క్లినిక్, శ్రీనివాస ప్రథమ చికిత్స కేంద్రం, బీవీ నాయక్ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు రామారావు, బీవీనాయక్, ఇస్లావత్ వీరన్నను నకిలీ డాక్టర్లుగా గుర్తించామన్నారు. వీరి క్లినిక్‌లను సీజ్‌చేసి, అయా నకిలీ డాక్టర్లపై ఎన్ఎంసీ 34, 54 సెక్షన్ల కింద కేసు బుక్ చేశామన్నారు. తనిఖీ బృందాల రాకను గుర్తించిన డాక్టర్లుగా చలామణి అవుతున్న మరో ముగ్గురు రాజు, శంకర్, వెంకన్న వారివారి క్లినిక్‌లను ముందేమూసేసి పరారయ్యారని, వీరిపై పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తూ ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌లను నిర్వహించేవారు. డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. నకిలీ వైద్యులను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఇక్కడ నిఘా టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీలో రాష్ట్ర వైద్య టాస్క్‌ఫోర్స్ సభ్యులు కొలిపాక వెంకటస్వామి, శంకేశి శిరీశ్ తదితరులు ఉన్నారు. కాగా, క్వాలిఫైడ్ డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ ఉంటనే మెడికల్ షాపు నిర్వాహకులు మందులు పేషంట్లకు మందులు ఇవ్వాలని నరేశ్‌కుమార్ సూచించారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో పరీక్ష నిర్వహణ, విధి విధానాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా జరిపేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలుండగా.. అందులో మహబూబాబాద్‌లో 07, తొర్రూరులో 05 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మూడురూట్లు, ఆరుగురు రూట్ ఆఫీసర్లు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లను నియమించామని వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ ఎగ్జామ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 4,412 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. పరీక్ష నిర్వహణకు 82 మంది ఇన్విజిలెటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ సెంటర్‌కు ఇద్దరు అబ్జర్వర్లు, 12 మంది చీఫ్ సూపరిండెంట్లుగా, చెకింగ్‌స్క్వాడ్ 53 మంది ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జామినేషన్ సెంటర్‌లో టీజీపీఎస్సీ నిబంధనలు పాటిస్తూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చెప్పారు. ఏవేని సందేహాలను నివృత్తి చేసుకునేందుకు టీజీపీఎస్సీ టోల్‌ఫ్రీనెంబరు 7995074803ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో గ్రూప్-1 రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, అధికారులు నర్మద, హరిప్రసాద్, సత్యనారాయణ, అనిల్‌కుమార్, బాల రాజు, రామకృష్ణ, సుధాకర్, అభిమన్యుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7: తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అథ్లెట్లు అత్యధిక పతకాలను కొల్లగొట్టి సత్తాచాటారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్నా రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాల బాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది పాల్గొన్న అథ్లెట్ల మధ్య హోరాహోరీగా జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యధిక పతకాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. అండర్-18 బాలుర విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం క్రీడాకారుల పోటీతత్వాన్ని ప్రదర్శించి సత్తాచాటారు. అదే విధంగా మెన్ విభాగంలో కరీంనగర్ ప్రథమ స్థానం, ఉమెన్ విభాగంలో ఖమ్మం జిల్లాలకు చెందిన అథ్లెట్లు రాణించారు.

కాగా, జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు చిరు ప్రాయం నుంచే వారి పిల్లలను మైదానాలకు పంపించి అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్నారులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. చిన్నారులను 8వ యేడు నుంచే క్రీడా మైదానాలకు పంపించి అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించడంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని అనుకున్న గమ్యాన్ని చేరే అవకాశం ఉంటుందన్నారు. చైనా దేశంలో అక్కడి చిన్నారులను 8ఏళ్ల ప్రాయం నుంచే క్రీడా మైదానాలకు పంపిస్తారన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లా కేంద్రంలో అథ్లెట్ల కోసం సింథటిక్‌ట్రాక్‌లు నిర్మాణం చేపట్టేలాగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.



అండర్-18బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన అతిథ్య హనుమకొండ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదురుపాక సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ముగింపు రోజు 20కిలోమీటర్ల రేస్‌వాక్, 200, 1500 మీటర్ల పరుగు పందెం, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, 4ఇంటూ100రిలే, మిడ్‌లే రిలే, 10వేల మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15నుంచి17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాజు, జగన్, రజనీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి నీలం సురేష్, రాజుగౌడ్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, చిత్రంలో సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 7: ఈనెల 9న ఆదివారం జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి పంపించాలని, 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లను మూసివేయాలని, సెకన్ ఆలస్యమైనా అనుమతించకూడదని ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా కనిపించకపోయినట్లయితే 3 కలర్ ఫొటోలు తీసుకుని హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ముందస్తుగా చేరుకుని హాల్ టికెట్ నంబర్లను చెక్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్నులను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్, వైట్ పేపర్స్, పెన్‌డ్రైవ్, టాబ్లెట్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు వేసుకుని రావాలన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరినీ బయటకు పంపించడం జరగదని, అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతోపాటు తీసుకెళ్లేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, అధికారులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూన్ 7: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 76 సెంటర్లలో 35వేల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదని తెలిపారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఆదివారం సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.

పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా

ఎస్ఈలకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలు



హనుమకొండ టౌన్, జూన్7: గ్రూప్- 1 పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి ఉమ్మడి ఐదు జిల్లాల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ సెంటర్‌కు ఏఈ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. ఈ నెలలో జరిగే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌కు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎం కె.కిషన్, డీఈ (టి) కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

కాజీపేట, జూన్ 7: అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన రంగాచారి (45) నిట్‌లో మెటలర్జీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్నిరోజుల కిందట కుటుంబకలహాలతో భార్య, బిడ్డను తీసుకుని వెళ్లి పుట్టింట్లో ఉంటోంది. గురువారం రాత్రి స్విగ్గీలో డిన్నర్ ఆర్డర్ చేసుకుని భోజనం అనంతరం నిద్రపోయాడు. తెల్లవారేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి తలుపులు పగలకొట్టి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనారోగ్యంతో నిద్రలో మృతి చెందాడా, లేకుంటే ఆత్మహత్యకు పాల్పడ్డడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ పనితీరుపై అసహనం



అంబట్‌పల్లి ఎల్‌అండ్‌టీ కాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మహదేవపూర్ రూరల్, జూన్ 7: వానాకాలం వరదలు ప్రారంభం కాకముందే పనులు పూర్తిచేసి మేడిగడ్డ బ్యారేజీ గేట్లన్నీ తెరిచి ఉండేలా చూడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ శుక్రవారం లింక్-1లో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. తొలుత సుందిళ్ల బ్యారేజీ ఆతర్వాత అన్నారం బ్యారేజీని పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడిగడ్డ చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నబోజనం అనంతరం మీడియాతో మాట్లాడారు. బ్యారేజీలో లోపాల అంశం కేవలం అధికారుల స్థాయిలో మాత్రమే చర్చించారని.. ముఖ్యమంత్రి, మంత్రి స్థాయిలో దీనిపై సమీక్ష జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు బ్యారేజీల వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకే బ్యారేజీలను సందర్శించామని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మధ్యంతర ఉత్తర్వుల్లో సూచించిన విధంగా జరిగే పనుల పురోగతిని పరిశీలించేందుకే వచ్చానని అన్నారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పుతెచ్చి కడితే అందులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో లీకేజీలు అధికమయ్యాయని, మేడిగడ్డ బ్యారేజీ ప్రక్కరే కుంగిపోయిందని అన్నారు. దీంతో ప్రాజెక్టు కుంగిపోయి నిరుపయోగంగా మారితే ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు చేసిన అప్పులకు మనమంతా వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బ్యారేజీల పరిస్థితిపై తమ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాయడం వల్లే సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటై బ్యారేజీలను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయని, బ్యారేజీ కుంగిన రోజే నీటిని దిగువకు విడుదల చేస్తే కుంగుబాటు తీవ్రత తగ్గి ఉండేదన్నారు. ప్రస్తుతం బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికి లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల గేట్లను వరదలు పూర్తయ్యే వరకు ఎత్తే ఉంచనున్నట్లు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటైన ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పట్టించుకోకుండా నీటిని నిల్వ చేసి ఎత్తిపోయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు మార్లు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్న ఆయన తన పరిశీలనలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరుగుతున్న పనులు సంతృప్తి ఇచ్చాయని, సుందిళ్లలో పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ అధికారులను హెచ్చరించామని తెలిపిన మంత్రి.. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యారేజీలను పునరుద్ధరించడానికి తాత్కాలిక, శాశ్వత మరమ్మతులపై ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్‌డీఎస్‌ఏ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు మూడు బ్యారేజీల్లో గేట్లన్నీ తెరిచే ఉంచాలని, బ్యారేజీల్లో ప్రధానంగా జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలతో పాటు జీఆర్‌పీ, ఈఆర్‌టీ టెస్టులు చేయాలని సూచించినట్లు తెలిపారు. వీటితో పాటు బ్యారేజీల ఎగువ, దిగువ ప్రవాహాల ముందున్న సీకెంట్ ఫైల్స్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా, ఉంటే ఏంటనేది గుర్తించాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే సీజన్‌లో నీటిని ఎత్తిపోసేందుకు ఎన్‌డీఎస్‌ఏ అనుమతితో జియో ట్యూబ్స్ ఏర్పాటు చేసి పంపింగ్ చేస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటిస్తే అన్నారంలో 11మీటర్లు, సుందిళ్లలో 9మీటర్ల వరకు నీటిని నిల్వ చేస్తూ ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేసుకోవచ్చని అన్నారు.ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థ ప్రతినిధి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. జీపీఆర్ టెస్టు ఆధారంగా ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయని సీసీ బ్లాక్, షీట్‌ఫైల్స్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రి ఉత్తమ్ జ్యుడీషియల్ కమిషన్ విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో విజిలెన్స్ విచారణ ఆధారంగా అప్పటి ఈఎన్‌సీని సర్వీస్ నుంచి తొలగించామని, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్‌రావును ఎక్స్‌టెన్షన్‌ను టర్మినేట్ చేశామని అన్నారు. అన్నారం, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో పంపులన్నీ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ఏ నిర్ణయం తీసుకుంటారని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. తప్పకుండా ఆ ప్రాజెక్టును నిర్మిస్తామని అన్నారు. తమ మేనిఫేస్టోలోను ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించలేదన్నారు. ఐదేండ్లలో 65టీఎంసీల నీటిని ఎత్తిపోసిన ఈ ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు ఎలా స్థిరీకరించబడిందో తెలపాలన్నారు. పాలమూరు రంగారెడ్డికి రూ.23,500కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు లేదని, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,500 కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు రాలేదని తెలిపారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా 16లక్షల ఎకరాలకు సాగునీరందిస్తే సంవత్సరానికి వచ్చే ఎలక్ట్రిసిటీ బిల్లు రూ.వెయ్యి కోట్లయితే కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌లు నడిస్తే సంవత్సరానికి రూ.10వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. ఎల్‌అండ్‌టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ అనంతరం మంత్రి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ దిగువన, ఎగువన జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక పనులను పరిశీలించారు. అనంతరం బ్యారేజీ నుంచి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు. ఆయన వెంట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రాజ్‌ఠాకూర్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావులతో పాటు ఎంపీపీ బస్వేడ రాణిబాయి, జడ్పీటీసీ గుడాల అరుణ తదితరులున్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద పగుళ్లు తేలిన పిల్లర్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

అన్నారం బ్యారేజీ పనుల్లో వేగం పెంచండి

మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీకి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బ్యారేజీ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. బ్యారేజీలో పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్ళిన మంత్రి పనుల్లో వేగం పెంచి వానాకాలం లోపు పనులు పూర్తిచేసి గేట్లన్నీ తెరిచి ఉంచాలని అన్నారు. పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి బయలుదేరి వెళ్లిపోయారు.

పనుల్లో వేగం పెంచండి

అన్నారం బ్యారేజి సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

మహదేవపూర్, జూన్ 7: అన్నారం బ్యారేజీ మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధికారులకు సూచించారు. మహదేవపూర్ మండలంలోని అన్నారం సరస్వతి బ్యారేజీని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి వివరాలు సేకరించగా, శుక్రవారం అన్నారం బ్యారేజీని సందర్శించి 35, 48 పిల్లర్ల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్న ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2019, 2020లో లీకేజీల సమస్య, సీసీ బ్లాకులు కొట్టుకపోవడం లాంటి సమస్యలు ఏర్పడినప్పుడు చేసిన మరమ్మతు పనులను పీసీ ఘోష్ అడిగి తెలుసుకున్నారు. ఎంతో అనుభవం కలిగిన సంస్థ నిర్మాణం సందర్భంగా ఇలాంటి సమస్యలను ముందుగా ఎందుకు అంచనా వేయలేదని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వర్షాకాలం ఆరంభమైన దృష్ట్యా వరదలు వచ్చేలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట బ్యారేజీ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదిగిరి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కాజీపేట తిరుమలయ్య

రేపటి నుంచి పోతన విజ్ఞాన పీఠంలో నాటకోత్సవాలు

వడ్డేపల్లి, జూన్ 7: వరంగల్ జెమినీ థియేటర్ ప్రాంతంలోని పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 9, 10, 11 తేదీలలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల తెలుగు ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావులు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9న రాత్రి 7.30 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు రాత, ప్రక్షాళన, 10న అనూహ్యం, వీలునామా, 11న నిశబ్దమా.. నీ ఖరీదెంత?, ఉన్నది ఒకటే జీవితం అనే నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రేక్షకులు, కళాకారులు, కళాభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొని ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జీవీ బాబు, వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, శర్మ, సాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల్దీవుల అతిథులకు విస్తృత ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులతో బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్



వరంగల్ కార్పొరేషన్, జూన్ 7: ఈ నెల 17 నుంచి 19 వరకు మాల్దీవుల నుంచి వరంగల్ నగరంలో పర్యటించనున్న అతిథులకు కావలసిన విస్తృత ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ నగర పాలక సంస్థ అవలంబిస్తున్న పారిశుధ్య విధానంపై అధ్యయనం, ఇక్కడి పద్ధతులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, మోడల్ వైకుంఠధామం సందర్శన, ఎఫ్ఎస్‌టీపీ, ఎస్‌టీపీ కేంద్రాల పర్యటన, బయోమైనింగ్ విధానాన్ని అతిథులు వస్తున్నారని అన్నారు. మూడు రోజుల పాటు ఇక్కడి అధికారులు, సిబ్బందికి వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్ఓ రమేష్, ఈఈ సంజయ్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-2024కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు ఇంటర్‌లో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. జూలై 10న నిర్వహించే డీసెట్‌కు ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. దరఖాస్తు కోసం http://-deecet.cdse.telangana.gov.in వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు వేళాయే..

● షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వం ● నేటి నుంచే ప్రక్రియ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెనువెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నుంచే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. వరంగల్, హనుమకొండ జిల్లాలో వెయ్యి మంది ఉపాధ్యాయులకు వివిధ కేటగిరీల్లో పదోన్నతులు సాధించనున్నారు. మల్టిజోన్ -1లో ఈ ప్రక్రియ జూన్ 8 నుంచి ప్రారంభమై జూన్ 22తో ముగియనున్నది. మొత్తంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మల్టిజోన్ - 1లో 15 రోజుల్లో, మల్టీజోన్ -2లో 23 రోజుల్లో పూర్తి చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్‌ను ఖరారు చేసి విడుదల చేసింది.

షెడ్యూల్ ఇలా..

జూన్ 8, 9 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్‌ల తాత్కాలిక పదోన్నతుల జాబితాను ప్రకటించాలి. ప్రస్తుత ఖాళీలతోపాటు స్కూల్ అసిస్టెంట్ల తర్వాత ఏర్పడిన ఖాళీల తాత్కాలిక జాబితాను ప్రకటించాలి. ఎస్జీటీల బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను ప్రదర్శించాలి. ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను డీఈవోలు స్వీకరించాలి. 10, 11 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను స్వీకరించాలి. అభ్యంతరాలు, ఫిర్యాదులను డీఈవోలు పరిష్కరించాల్సి ఉంటుంది. 12వ తేదీన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్ల పదోన్నతులు తుది జాబితాను రూపొందించి ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరచాలి. 13 నుంచి 16 వరకు స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్‌కు అర్హత పొందిన ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలి. పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్‌ల ఉపాధ్యాయులకు పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తారు. 17న ఎస్జీటీల బదిలీల కోసం ఖాళీల జాబితాలను ప్రదర్శించాలి. జాబితాల్లోని అభ్యంతరాలను పరిష్కరించాలి. 18 నుంచి 20 వరకు తుది జాబితాను ప్రదర్శించాలి. వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేయాలి. 21, 22 తేదీల్లో బదిలీల ఉత్తర్వులును సంబంధిత ఉపాధ్యాయులకు అందజేయాలి.

నేడు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ల రిలీవ్

గత ఏడాది నిర్వహించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అక్టోబర్ మాసంలో బదిలీలు పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం వారు బదిలీ అయిన స్థానాల్లోకి వెళ్లాల్సిందిగా విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇలా..

ప్రభుత్వం ప్రకటించిన పదోన్నతుల ప్రక్రియలో హనుమకొండ జిల్లాలో వివిధ కేటగిరీల్లో సుమారుగా 500 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించనన్నారు. 240 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు సాధిస్తుండగా, మరో 260 మంది భాషా పండితులు, పీఈటీలు అప్‌గ్రెడేషన్ పొందనున్నారు. ఇక వరంగల్ జిల్లాలో సుమారు 300 మంది స్కూల్ అసిస్టెంట్లు తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు పొందుతుండగా, 200 మంది భాషోపాధ్యాయులు, పీఈటీలు అప్‌గ్రేడ్ కానున్నారు.

హనుమకొండ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్ఏ గణితం	2	1	12	8
ఎస్ఏ ఫిజిక్స్(తె)	1	1	5	4
ఎస్ఏ బయో(తె)	2	1	0	0
ఎస్ఏ సోషల్(తె)	8	6	39	27
ఎస్ఏ సోషల్(ఉ)	2	1	0	0
ఎస్ఏ తెలుగు	6	4	19	9
ఎస్ఏ హిందీ	5	4	7	5
ఎస్ఏ ఇంగ్లీష్	4	3	18	13
ఎస్ఏ ఉర్దూ	1	1	0	0
ఎస్ఏ(పీడీ)(తె)	1	1	6	4
పీఎస్‌హెచ్‌ఎం	4	4	43	43

వరంగల్ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్ఏ గణితం	5	4	13	9
ఎస్ఏ ఫిజిక్స్	2	1	6	4
ఎస్ఏ బయో	11	8	28	20
ఎస్ఏ ఇంగ్లీష్	3	2	19	13
ఎస్ఏ సోషల్	11	8	49	34
ఎస్ఏ తెలుగు	7	5	12	8
ఎస్ఏ హిందీ	8	6	5	4
ఎస్ఏ ఉర్దూ	3	2	0	0
ఎస్ఏ పీడీ	0	0	6	4
పీఎస్‌హెచ్‌ఎం	6	6	54	54

లారీ, బైక్ ఢీకొని ఒకరి మృతి

● మాజీ సర్పంచ్ వెంకన్న పరిస్థితి విషమం ● లారీ డ్రైవర్ పరార్



చెట్టును ఢీకొని బోల్తాపడిన లారీ, మృతి చెందిన వీరన్న

కేసముద్రం, జూన్ 7 : మండలంలోని పెనుగొండ క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఒకరు మృతి చెందగా, అదే మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.సబ్‌స్టేషన్‌తండాకు చెందిన గుగులోత్ వీరన్న (50), తాజామాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్నలు బైక్‌పై మహబూబాబాద్‌కు వెళుతున్నారు. పెనుగొండ క్రాస్ రోడ్డు సమీపంలో మహబూబాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ మరో ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తోంది. పూర్తిగా కుడివైపునకు వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న వీరన్న బైక్‌ను గమనించి, దాన్ని తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఆపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని నిలిచిపోయింది. ఆ వెంటనే లారీ డ్రైవర్ పారిపోయాడు. బైక్‌ను నడుపుతున్న గుగులోత్ వీరన్న అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న గుగులోత్ వెంకన్న చేయి విరిగి తలకు తీవ్ర గాయాలై రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న కేసముద్రం ఎస్ఐ వంశీధర్ ఘటనాస్థలానికి చేరుకొని అందుబాటులో ఉన్న ప్రైవేటు వాహనంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి పంపించారు. వెంకన్న పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా కూలీ పనిచేస్తున్న మృతుడు వీరన్నకు భార్య బుజ్జి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటన స్థలాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య పరిశీలించారు.

కొత్తగూడలో యువకుడు..


రాజ్‌కుమార్ (ఫైల్)

కొత్తగూడ : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బాల్య రాజ్‌కుమార్ (30) కొత్తగూడ నుంచి గుంజేడు దారిలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకోనగా రోడ్డు పక్కన తీవ్రగాయలతో పడి ఉన్నాడు. దారిలో వెళుతున్న కొందరు గమనించి 108ద్వారా నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజ్‌కుమార్ మృతిచెందాడు.


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, టీడీపీ నేతలు

ఏపీలో టీడీపీ పోరాటం ఫలించింది

● మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

మహబూబాబాద్ టౌన్, జూన్7 : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం చేసిన ఐదు సంవత్సరాల పోరాటానికి అసెంబ్లీ ఎన్నికలతో ఫలితం దక్కిందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండిపుల్లయ్య అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడాన్ని హర్షిస్తూ మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూసెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సైకో సర్కార్ పోయి ప్రజాప్రభుత్వం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో బడుగుబలహీన వర్గాలకు మేలు జరగనుందని, ఆయన దేశ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించనున్నారని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎమ్డీ. ఇమాం, నాయకులు పేరం వీరస్వామి, ఎల్లయ్య, రాములు, గోపాల్, ముత్తయ్య పాల్గొన్నారు.

పేద రెడ్డి కులస్థులను ఆదుకుంటాం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


యశస్వినిరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న వ్యాపారులు

తొర్రూరు, జూన్ 7 : సమాజంలో తోచినంత మేరకు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులో రెడ్డి సంక్షేమ పరివార్ సేవా సొసైటీ 12వ వార్షికోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా పేద రెడ్డి కులస్థులను అన్ని విధాలుగా ఆదుకుంటూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి తన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంక్షేమ పరివార్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దం విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, కోశాధికారిగా వెన్నం రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింహరెడ్డి, సుధీర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, కె.చంద్రశేఖర్ రెడ్డిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మొదటిసారి రెడ్డి సంక్షేమ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని శాలువా మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల బ్రహ్మానంద రెడ్డి, కె.అచ్చిరెడ్డి, మహబూబ్ రెడ్డి, రఘునాథరెడ్డి, సంపత్ రెడ్డి, వేణుమాధవ రెడ్డి, వీరారెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విక్రయాలు నిలిపివేయాలని వినతి..

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్స్ ఇతర స్టేషనరీ విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి స్టేషనరీ బుక్స్ వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు గంజి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విక్రయాలు చేపట్టవద్దని ప్రభుత్వం జీవో జారీచేసినా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పుస్తకాలు, యూనిఫామ్స్ కొనుగోలు చేయాలని మెసేజ్‌లు పెడుతూ ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి విక్రయాలు నిలిపివేయాలని కోరారు.

సెంట్రల్ లైటింగ్ కోసం త్వరలో రోడ్డు విస్తరణ

- రూ.25 కోట్లతో రెండు రూట్లలో మంజూరు
- 16.5 మీటర్ల వెడల్పుకే ప్రతిపాదనలు?
- రహదారి వెంట చాలా దుకాణాలు సేఫ్


కేసముద్రం మార్కెట్ సమీపంలో చిరువ్యాపారుల దుకాణాలు

కేసముద్రం, జూన్ 7 : మండల కేంద్రంలో రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొద్ది రోజులుగా కేసముద్రంలో రోడ్డు వెడల్పు పనులపై రకరకాల ఊహాగానాలతో చర్చనీయాంశంమైంది. ఎంత మేరకు రోడ్డు వెడల్పు అవుతుందో? తమ దుకాణాలు ఉంటాయా! కోల్పోతామా? అని రోడ్డు వెంట ఉన్న చిరువ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ఎక్కువ మందికి నష్టం వాటిల్లకుండా రోడ్డు అభివృద్ధి పనులు చేయాలనే ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు రిపోర్టు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు రెండు మార్గాల్లో రూ.25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి టెండరు నోటిఫికేషన్‌కు సిద్ధంగా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం. అంబేద్కర్ సెంటర్ నుంచి మార్కెట్ రోడ్డు మీదుగా కేసముద్రం విలేజి దర్గా వరకు రూ.20 కోట్లు, మోహన్‌టాకీస్ నుంచి పొట్టిశ్రీరాములు సెంటర్ వరకు రూ.5 కోట్లతో నాలుగులైన్ల రోడ్డును ప్రతిపాదించారు. రోడ్డుకు మధ్యలో 1.5 మీటర్ల వెడల్పుతో డివైడర్ అందులోనే సెంట్రల్ లైటింగ్ వచ్చే విధంగా రూపొందించారు. ఈ డివైడర్‌కు ఇరువైపులా 7.5 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు, ఆపై 1.2 మీటర్లతో సైడు కాల్వతో డిజైన్ చేసినట్లు సమాచారం. ఈ వెడల్పుతో రోడ్డును విస్తరిస్తే అంబేద్కర్ సెంటర్, మార్కెట్ గేటు వద్ద రోడ్డుకు దగ్గరగా ఉన్నచాలా దుకాణాలకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని తెలుస్తోంది. ఏదేమైనా త్వరలో కేసముద్రంలో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లైన్ల రోడ్డు రాబోతోందనేది వాస్తవం.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు నమోదు : డీఎస్పీ

మహబూబాబాద్ టౌన్, జూన్7 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, నకిలీ, లూజు విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని మానుకోట డీఎస్పీ ఎన్.తిరుపతిరావు హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో డివిజన్ లెవల్ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ ఆగ్రోస్ ఏజెన్సీ, బాలాజీ అగ్రిమాల్ దుకాణాలు, గోదాంల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలని, అమ్మిన ప్రతీ విత్తన ప్యాకెట్ వివరాలను ఫార్మర్ సేల్స్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. మహబూబాబాద్ ఏడీఏ ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులు పంట చివరి కాలం వరకు విత్తనప్యాకెట్ బిల్లులు భద్రపర్చుకోవాలని చెప్పారు. ఈ తనిఖీల్లో టౌన్ సీఐ దేవేందర్, మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సరిపడా ఎరువులు

● జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 7 : రైతులకు వానాకాలానికి సంబంధించిన పంటలకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు తెలిపారు. మహబూబాబాద్‌లో శుక్రవారం వ్యవసాయ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మంగళవారం రైతు వేదికలో నిర్వహించే రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎక్కువ మంది కర్షకులను పాల్గొనేలా చూడాలన్నారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాలు రైతులకు అందేలా విధంగా చూడాలని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు దుకాణ దారులు తప్పతకుండా రశీదు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏడీఏ టెక్నికల్ జి.రాజనరేందర్, ఏవో టెక్నికల్ స్వామి, సారయ్య, ఏవో, ఏఈవోలు పాల్గొన్నారు.

డీడీలను వాపసు ఇవ్వొద్దు

● జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లయ్య

మహబూబాబాద్ టౌన్, జూన్ 7 : డీడీలు తీసిన గొల్లకురుమలకు వాటిని వాపసు చేయకుండా గొర్రెల పంపిణీకి సంబంధించి నగదుబదిలీ చేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో పశుసంవర్థక శాఖ జాయింట్ డెరెక్టర్ సుధాకర్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని 2017లో ప్రారంభించినప్పటికి వారి పాలనలో అందరికి గొర్రెలను పంపిణీ చేయడలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికి వేలాది మంది గొర్రెల పంపిణీ యూనిట్ సబ్సిడి కింద గొల్లకురుమలు రూ.43750 డీడీలు కట్టి ఎదురు చూస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వారికి డీడీలు వాపసు చేయకుండా గొర్రెలకు బదులు నగదు బదిలీచేసి ఆదుకోవాలన్నారు. ఇమ్మడి గోవిందు, రఘు, మల్లేశం, రాజు, ఎడ్ల శ్రీనివాస్, శ్రీను, రాంబాబు, రవి, వీరన్న, నరేందర్ పాల్గొన్నారు.

గుంజేడులో భక్తులపై తేనెటీగల దాడి


గాయపడిన సంజయ్‌కుమార్

కొత్తగూడ, జూన్ 7 : మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరలో పలువురు భక్తులపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుంజేడు జాతరకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. మొక్కుల అనంతరం చెట్లకింద వంటలు చేసుకుంటుండగా పొగకు చెట్లపైన ఉన్న తేనెటీగలు లేచి జాతరలో పలువురు భక్తులకు దాడి చేశాయి. తేనెటీగల దాడిలో గాయపడిన వారి బంధువులు ఆస్పత్రులకు తరలించారు.

పాము కాటుతో యువకుడికి అస్వస్థత

మరిపెడ, జూన్ 7 : పాముకాటుకు గురైన ఓ యువకుడు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం తానంచర్ల రెవెన్యూ పరిధి జెండాల తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. ఆ తండాకు చెందిన భూక్యా రెడ్యా వ్యవసాయ పనులకు వెళ్లి కట్లపాము కాటుకు గురయ్యాడు. ఈయన తీవ్ర అస్వస్థతకు చేరుకోవడంతో కుటుంబసభ్యులు గుర్తించి మరిపెడ పీహెచ్‌సీకి తరలించారు. డాక్టరు రవి ప్రథమ చికిత్సలు జరిపి అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు రవి మాట్లాడుతూ వర్షకాల సీజన్‌లో రైతులు, ప్రజలు విషపురుగుల పట్లఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అభ్యర్థి రాములు నాయక్, సీపీఐ అభ్యర్థి జయసారథిరెడ్డి, యువ తెలంగాణ పార్టీ నుంచి రాణిరుద్రమరెడ్డి తదితరులు పోటీ చేశారు. వారిలో ప్రేమేందర్‌రెడ్డి నాలుగో స్థానంలో ఉండగా, ఆయన ఎలిమినేషన్ తర్వాత కూడా మొదటి, రెండో స్థానాల్లో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తీన్మార్ మల్లన్నల్లో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో మూడో స్థానంలో ఉన్న ప్రొఫెసర్ కోదండరామ్‌ని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. కోటా ఓటుకు పల్లారాజేశ్వర్‌రెడ్డి చేరడంతో ఆయన్ను ఎమ్మెల్సీగా ప్రకటించారు. ఆ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మల్లన్నే ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి బరిలో దిగి, తీవ్ర పోటీలోనూ సంచలన విజయం నమోదు చేశారని చెప్పవచ్చు.

మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా మల్లన్న విజయం

జర్నలిస్టుగా, ప్రశ్నించేగొంతుకగా.. తీన్మార్ మల్లన్నగా అందరికీ సుపరిచితుడైన చింతపండు నవీన్ ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2015లో ఆయన మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. ఆతర్వాత 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా కొట్లాడిన క్రమంలో మల్లన్నపై 59వరకు కేసులు నమోదయ్యాయని, ప్రశ్నించేగొంతుకగా పోరాడిన మల్లన్న గెలుపు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్‌నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో జరిగిన అన్ని రౌండ్లలోనూ మల్లన్నకు ఓట్ల ఆధిక్యత వచ్చింది. మొత్తం 4,63,839 ఓట్లకు గాను, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. వీటిల్లో 25,824 ఓట్లు చెల్లకుండా పోగా, 3,10,189 ఓట్లు చెల్లాయి. వీటిల్లో కోటా ఓటు 1,55,095 ఓట్లు ఎవరికీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. బబీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 29,967 ఓట్లు వచ్చాయి. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ అశోక్‌కుమార్ సహా స్వతంత్ర అభ్యర్థులందరిఓట్లలో మల్లన్నకే ఎక్కువ ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఓట్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి దీటుగా ఓట్లు రాబట్టారు.

వేతనాల కోసం జీపీ సిబ్బంది ధర్నా

కేసముద్రం, జూన్7 : తొమ్మిదినెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది కేసముద్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ అనుబంధ జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, జీపీ వర్కర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జాటోత్ మంగీలాల్, గంధసిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తొమ్మిదినెలలుగా వేతనాలు లేక తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దుర్గాల వెంకన్న, వల్లందాసు అనీల్, బీర్రు లక్ష్మణ్, బాల్యానాయక్, టేకుల శ్రీనివాస్, కొమ్ము భాస్కర్, సుంచు కొమురయ్య, కొంగర సౌందర్య, తెల్ల సుమలత, సుజాత, సంజీవ, సూరయ్య, జాన్సన్, శ్రీను పాల్గొన్నారు.

నిరుపయోగంగా రోడ్ స్వీపింగ్ మిషన్

● సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 7: మునిసిపాలిటీ పరిధిలో పారిశుద్య నిర్వహణ పనులు చేపట్టే ప్రక్రియలో భాగంగా సుమారు 18 నెలల క్రితం రూ. 75లక్షలతో కొనుగోలు చేసిన రోడ్ స్వీపింగ్ మిషన్, డ్రైయిన్ డీ సిల్టిన్ మిషన్ (మురుగు కాల్వలు శుభ్రం చేసే వాహనం) నిరుపయోగంగా మూలకు పడి ఉన్నాయని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథి రెడ్డి ఆరోపించారు. మహబూబాబాద్ మునిసిపల్ వద్ద శుక్రవారం సదరు వాహనాలను చూపి మాట్లాడారు. గత 18 నెలల క్రితం పట్టణ ప్రగతి నిధులు రూ.75 లక్షలతో రెండు వాహనాలను కొనుగోలు చేసి నామమాత్రంగా వాడగానే అవి పని చేయకపోవడంతో వాటిని మూలకు పడవేశారని చెప్పారు. ఆ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ ఆయన చేశారు.

'కూలీల సమస్యలు పరిష్కరించాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 7 : ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల విజ్ఞప్తి చేశారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో మునిసిపాలిటీల్లో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి కూలీలకు పని కల్పించాలని కోరారు. పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండ రాజన్న, కుర్ర మహేష్, చంద్రకళ, వెంకన్న, వెంకటేశ్వర్లు, బాణాల రాజన్న, ఎమ్డీ. యాకూబ్, ప్రశాంత్, సుజన, సమ్మయ్య ఉమా, లక్ష్మి, అలివేలు, ప్రియాంక, రమణ,వేణు, కాంతమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగంలో ఇంద్రజకు డాక్టరేట్



మరిపెడ రూరల్, జూన్ 7 : ఫార్మసీ విభాగంలో రాజస్థాన్ రాష్ట్రంలోని జేజేటీయూ యూనివర్సిటీ నుంచి తాళ్లఊకల్ వాసి ఇరుగు ఇంద్రజ డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాను శుక్రవారం సాధించారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ కళాశాల ఖమ్మంలోని కేపీఎక్స్ ఫార్మసి కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నానన్నారు. జేజేటీయూ యూనివర్సిటీ నుంచి ఫార్మసీ విభాగంలో డిజైన్ డెవలెప్‌మెంట్ అండ్ చార్ పట్లి సేషన్ ఆఫ్ ఓరల్ డిజైటింగ్ రేటింగ్ టాబ్లెట్ ఆఫ్ బోనోఫిజిల్ హైడ్రోక్లోరైడ్ సెలైజిన్ అండ్ సిట్లోపోరియం హైడ్రోక్లోరేడ్ అంశంపై గైడ్ డాక్టర్ ఖాజీమోహరాజ్, కో గైడ్ డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసి, డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కాగా, ఇంద్రజను పలువురు అభినందించారు.

ఎంపీ కావ్యను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

పెద్దవంగర, జూన్ 7 : వరంగల్ ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మండలంలోని వడ్డెకొత్తపల్లికి చెందిన మాజీజడ్పీ ఫ్లోర్‌లీడర్, మాజీ సర్పంచ్ నెమురుగొమ్ముల ప్రవీణ్‌రావు, ఎఫ్‌సీఎస్ వైస్ ఛైర్మన్ ముత్తినేని శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హన్మకొండలోని కడియం నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. నాయకులు తంగేళ్లపల్లి మల్లికార్జునచారి, మల్లేష్, ఎల్లయ్య, రమేష్, రాంమూర్తి, ఉపేందర్, యాకన్న, స్వామి, అనిల్, అరుణ్, బీరన్న, పరుశరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఆస్పత్రులపై చర్యలు

● జిల్లా వైద్యాధికారి కళావతి బాయి

తొర్రూరు, జూన్ 7 : ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి కళావతి బాయి అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని నోద హాస్పిటల్, శ్రీసూర్య డెంటల్, లోహిత డెంటల్, సుప్రిత హాస్పిటల్‌ను తనిఖీ చేయగా నోద ఆస్పత్రి, డెంటల్ ఆస్పత్రులకు ప్రభుత్వ అనుమతులులేవని వారికి నోటీసులు జారీచేశామన్నారు. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం అలోపతి, యునాని, ఆయుర్వేద, సిద్ధయోగ ఫిజియోథెరపి క్లినిక్‌లకుఅనుమతులు ఉండాలన్నారు. యాజమాన్యం ధరల వివరాలను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ సర్టిఫికెట్‌లను సమకూర్చుకోవాలన్నారు. పట్టణంలో గత కొన్ని నెలలుగా లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతులు లేకుండా చేస్తున్నా, అనుమతులు లేని ఆస్పత్రులు నిర్వహిస్తున్నా అధికారులు తనిఖీలకే పరిమితమవుతున్నారే తప్ప, ఎలాంటి చర్యలులేవని ప్రజలు వాపోతున్నారు. వైద్య సిబ్బంది ప్రసాద్, మంగమ్మ ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి

తొర్రూరు, జూన్ 7 : వ్యవసాయ శాఖలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరు ఆగ్రోస్, పీఏసీఎస్‌లలో పచ్చిరొట్ట, జీలుగ విత్తనాల అమ్మకాల్లో జరిగిన కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ ఎమ్మార్వో నర్సయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఏవో కుమార్‌యాదవ్ 1600 జీలుగ విత్తనాల బస్తాలను రైతుల పేరుతో అమ్ముకున్నారని అధికారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తనిఖీల పేరుతో హడావిడి చేస్తూ చేతులు దులుపుకుంటుందే తప్ప చర్యలు లేవని, తొర్రూరు లాంటి డివిజన్ కేంద్రంలో పెద్దఎత్తున మోసాలు, అక్రమాలు జరుగుతున్నా సంబంధిత జిల్లా వ్యవసాయాధికారి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, వీరన్న, యాకయ్య, మధు, వెంకన్న ఉన్నారు.

'విధుల నుంచి తొలగించవద్దు'

తొర్రూరు, జూన్ 7 : విధుల నుంచి తొలగించవద్దని మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు బిల్ కలెక్టర్‌లు శుక్రవారం మునిసిపల్ మేనేజర్ కట్టస్వామికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తొర్రూరు గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీ అయ్యే వరకు కాంట్రాక్టు బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం అకారణంగా తమను విధుల నుంచి తొలగించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా వచ్చిన వీఆర్‌వోలకు, వీర్‌ఏలకు ఆ బాధ్యతలు అప్పగించడం సరికాదని, తమను విధుల్లోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ విషయంపై కమిషనర్‌ను వివరణ కోరగా మునిసిపల్ సీడీఎంఏ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే బిల్ కలెక్టర్‌ల వద్ద నుంచి కలెక్షన్ మిషన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాంట్రాక్టు బిల్ కలెక్టర్‌లు వెంకట్రాం నర్సయ్య, ఉపేందర్, యాకయ్య, శంకర్, వెంకన్న ఉన్నారు.

తనిఖీలు నిర్వహించిన అధికారులు

తొర్రూరు, జూన్ 7 : మండల పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టిన విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభన్‌బాబు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదిక వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొర్రూరులోని ఆగ్రోస్ కేంద్రాలు, పీఏసీఎస్ సెంటర్‌లలో గత రెండు నెలలుగా జరిగిన విక్రయాలపై వివరాలు సేకరించామన్నారు. తగు నివేదికలకు ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. రైతు వేదిక వద్ద ఉన్న ఏడీఏ శోభన్ బాబుకు వ్యవసాయ శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ రెడ్డి, వెంకన్న, అంకుష్, యాకూబ్, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

పశువుల రవాణాను అడ్డుకున్న బీజేపీ

పాలకుర్తి, జూన్ 7: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. 11 పశువు (దూడలు)లను హైదరాబాద్‌కు తలిస్తుండగా బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేశారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, దూడలను పాలకుర్తి గోశాలకు తరలించినట్లు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

'పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలి'

గార్ల, జూన్ 7 : ఖరీఫ్ సీజన్ దగ్గరపడుతున్న సమయంలో రైతులకు జనము, పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తిరుగుతు గుంటూరు నకిలీ విత్తనాలు అమ్ముతున్న దళారులపై అధికారులు నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంపాల వెంకన్న, లోకేష్, రాగం రమేష్, జనార్ధన్, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

● పారిశ్రామిక వేత్త పర్కాల శ్రీనివాస్‌రెడ్డి


బ్యాంకు మేనేజర్ శోభన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకు అధికారులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 7 : ఉద్యోగులకు బదిలీలుసహజమేనని విధి నిర్వహణలో మెరుగైన సేవలందించి, ప్రజల మన్ననలు పొందాలని పారిశ్రామికవేత్త, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ మాజీ ఛైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మానుకోటలో కెనరా బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి బెంగళూరుకు పదోన్నతిపై వెళ్తున్న శోభన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మేనేజర్‌గా వచ్చిన భూక్య శోభన్ మూడెళ్ల పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలందించి వారిమన్ననలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో అసిసెంట్ మేనేజర్ బాసు, అధికారులు సుజాత, మౌనిక, సత్య, భీమా, గీత, రామసహాయం వెంకట్‌రెడ్డి, బూర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

వర్షానికి రాహదారిపై కూలిన చెట్టు

నెల్లికుదురు, జూన్ 7 : బంజర గ్రామస్టేజీ వద్ద గురువారం రాత్రి కురిసిన భారి వర్షానికి చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నెల్లికుదురు, మహబూబాబాద్ ప్రధాన రహదారిపై చెట్టుకూలడంతో బస్సులు, లారీలు ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు చెట్టును తొలగించి రాకపోకలు కొనసాగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.